ఓంశ్రీసాయిరాం

మానంహిత్వా ప్రియోభవతి, క్రోధంహిత్వా నశోచతి
కామంహిత్వార్ధవాన్ భవతి లోభంహిత్వా సుఖీభవతి.

ప్రేమస్వరూపులారా!

అహంకారము లేని మానవుని అందరూ ప్రేమిస్తారు. క్రోధము లేని వానికి దుఃఖము కనిపించదు. కోరికలు లేని వానికి ఏ దుఃఖములు వెంటాడవు. నిరంతరము ఆనందమునే అనుభవిస్తూ ఉంటాడు. లోభము లేని వానికి నిరంతరమూ సుఖముగా చేస్తుంది ఈ జగత్తు.

*కోరికయే నిత్యశత్రువు*

మనస్సునందున్న మాలిన్యమును మనము పరిశుద్ధము చేసుకున్నప్పుడు మానవత్వమనేది దివ్యత్వముగా నిరూపిస్తుంది. ప్రపంచము ఈనాడు అనేక సమస్యలను యెదుర్కొనుచున్నది. ఒకవైపున యుద్ధభీతి, మరొకవైపున కరవుకాటకముల భయం, మూడవవైపున అధికారవాంఛ, నాల్గవవైపున స్వార్థపరత్వము. మనిషికి, మనిషికి మధ్య ద్వేషము. జాతికి, జాతికి మధ్య వైరము. దీనికి కారణం ఏమిటి? నైతికమును విస్మరించి, మానవత్వము మరచిపోవటంచేత సమాజంలో అనేకవిధములైన సమస్యలు కొరకరాని కొయ్యగా తయారయ్యాయి. దురాశ, భయము, క్రోధము ఈ మూడూ కల్గిన మానవుడు ఏ చిన్న కార్యము నందు విజయమును సాధించలేడు. మొదటిది దురాశ. కోరికలు మానవుని కృంగతీస్తున్నవి. కోరికలుండ వలసినదే కాని, పరిమితమైన కోరికలుండాలి. మితిమీరిపోవటం చేత మానవుని గతి దారి తప్పుతున్నది. ఈ కోరికలు చాలా భయంకరమైనవి. ఈనాడు విరోధి రేపు విశ్వాసి కావచ్చు. ఈనాటి శత్రువు రేపు మిత్రుడు కావచ్చు. నేటి మిత్రుడు రేపు శత్రువు కావచ్చు. కాని, కోరిక నిరంతరమూ శత్రువే. ఇవి మానవుని వెంటాడుతూ ఉంటాయి. నిత్యశత్రూనాం అన్నది భగవద్గీత. కోరిక నిత్య శత్రువు. ఈ కోరికలను మనము అదుపులో పెట్టుకోటానికి ప్రయత్నించాలి.

*దేహాభిమానమే దుఃఖము*

మానవుడు ఈనాడు అనేకవిధములైన అశాంతికి కృంగిపోతూ శాంతిని ఆశిస్తూ, దివ్యత్వమును కోరుతూ పవిత్రమును అభిలషిస్తున్నాడు. కాని, కోరిన కోర్కెలు ఎందుకు తీర్చుకోలేకపోతున్నాడు? ఈ దుఃఖములకు కారణము ఏమిటి? ఆశించినవి జరగలేదనా దుఃఖము లేక ప్రయత్నించిన కార్యము ఫలించ లేదనా దుఃఖము, లేక ధనకనకవస్తువాహనాదులు కూడబెట్టలేదనా దుఃఖము? ఈనాటి మానవుడు యిలాంటి వన్నీ దుఃఖములుగా భావించి కేవలము తన దివ్యత్వమును తాను మరచిపోతున్నాడు. ఇదికాదు నిజమైన దుఃఖము దేహాభిమానమే దుఃఖము. దేహము నేననుకోటమే దుఃఖము. నేను, నాది అనే రెండు పదములే దుఃఖాన్ని అందిస్తున్నాయి. నేను అహంకారము. నాది మమకారము. అహంకారమమకారములే మానువుని అనంత దుఃఖములకు మూలకారణము. దేహాభిమానమును తగ్గించుకోటానికి కొంతవరకు కృషి చేయాలి. ఈ కోరికలు మానవునికి ఆనందమును అందిస్తున్నవి, దుఃఖమును చేకూరుస్తున్నవి. మనస్సును అదుపులో ఉంచుకోవాలి. వేగముగా పరుగెత్తే రైలును లక్షలమంది చేరి దానిని పట్టుకొన్నప్పటికి అది నిలువదు. కాని, ఇంజనులో బ్రేకు వత్తితే రైలు నిల్చిపోతుంది. లక్షలాది ప్రజలు నిలబెట్టలేని రైలును ఒక చిన్న ములికి క్షణములో నిలబెడుతుంది. అదేవిధముగనే మానవుని సమస్త దుఃఖములకు మూలకారణము మనస్సే. 'మనఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' ఈ మనస్సును అదుపులో ఉంచుకున్నప్పుడు మనకు సర్వదుఃఖములు పరిహారమౌతాయి. 'ఆదిత్యవత్' అనింది భగవద్గీత. దేదీప్యమానంగా ప్రకాశించే సూర్యుని దట్టమైన మేఘములు కప్పినపుడు కనుపించక అంధకారబంధురమై ఉంటుంది. కాని, ఝంఝూమారుతము వీచినప్పుడు ఈ మేఘములు కదలి స్వప్రకాశుడై సూర్యుడు కనిపిస్తాడు. అదేవిధముగనే మానవునియందు దేదీప్యమానంగా ప్రకాశించే ఆత్మ ఉండినప్పటికీ మానవుని అభిమాన మమకారములనే వాంఛలు దట్టమైన మేఘములవలె ఈ ఆత్మతత్వాన్ని మనకు మరుగు చేస్తున్నవి. దీనికి ప్రేమ మారుతము వీచినప్పుడు ఈ అహంకారమమకారములు తొలగి ఆత్మత్వము అనే జ్యోతిని అందిస్తుంది. మానవుడు ఈనాడు తన అహంకార మమకారములను కొంతవరకు అదుపులో పెట్టుకొనుటకు ప్రయత్నించాలి. ఈ కోరికలు ఇంతటి వారిని, అంతటి వారిని కాదు సూర్యచంద్రాదులను కూడా, ఇంద్రాది దేవతలను క్షణములో క్రింద నెట్టివేస్తుంది. ఎంతటి మేధావంతుడైననూ, ఎంతటి విద్యావంతుడైననూ ఈ కోరికలకు తాను లొంగిపోక తప్పదు. ఈ మనస్సు ప్రభావమును సాధ్యమైనంతవరకు వేగమును అదుపులో పెట్టుకోవాలి. అర్జునుడు చాలా మేధాశక్తి కలవాడు. అతడు అనేకవిధములైన బిరుదులు పొందినవాడు. అర్జున, ఫల్గుణ, పార్థివ, కిరీటి, శ్వేతవాహన, సవ్యసాచి, భీభత్స, జయకృష్ణ, ధనుంజయ ఈవిధములైన బిరుదులను అందుకొన్నాడు. అలాంటి అర్జునుడు క్షణములోపల ఈ వ్యాధికి గురైపోతూ వచ్చాడు. ఈ స్వ అనే పదముకే తాను బంధింపబడుతూ వచ్చాడు. ఏమిటి ఈ స్వ? స్వజనులు, స్వబంధువులు. నావారు, ఈ అభిమానము చేతనే తన గాండీవము క్రింద వేసి దీనుడై తాను దుఃఖిస్తూ వచ్చాడు. కారణము? ఈ అభిమాన మమకారములే. ఇలాంటి అభమాన మమకారములు ఏక్షణమునందైనా, ఏసమయమునందైనా, ఏ ప్రదేశమునందైనా, ఏవయస్సునందైనై అతనిని

దునిమాడిపోతుంది. కనుక, ఈ అభిమానమమకారములను కొంతవరకు అదుపులో పెట్టుకొనుటకు ప్రయత్నించాలి.

**ప్రేమయే బలమైన శక్తి**

ప్రేమ అనే భగవంతుని సొత్తు, కేవలము మానవులకు మాత్రమే పరిమితము కాక సర్వజీవులకు, సర్వప్రాణులకు ప్రసరింపచేయాలి. ప్రేమశక్తి మహాబలమైన శక్తి. దీనికి మించిన శక్తి మరొకటి లేదు. కాని, దురదృష్టవశాత్తు ఈ ప్రేమకు పరిపరి అర్థములగావించుకొని దాని అపార్థములను స్వీకరించి, యదార్థమును విస్మరించి కేవలము దుఃఖములకు గురౌతున్నారు మానవులు. ఇది తమతమ భావములయొక్క వ్యత్యసములేగాని ప్రేమలో దోషము లేదు. ఈనాటి మానవుడు ఐహికంగా, ఆముష్మికంగా ఏదో ఒక ప్రతిఫలాపేక్షను కోరి భగవంతుని ప్రేమిస్తున్నారు. కాని, నిజముగా ఈ ప్రతిఫలము కోరే మానవుడు నిజమైన ప్రేమగా భావిస్తున్నాడా? లేదు. ఇది నిజమైన ప్రేమ కాదు. నా మిత్రుడు, నా తండ్రి, అని అనేకవిధములుగా అభిమానముతో, తద్వారా మనము అందరినీ ప్రేమించినట్లు నటిస్తున్నాము. ఇవి అభిమానములుగాని ప్రేమలు కావు. ప్రేమ అనగా ఏమిటి? ఎట్టి ఫలమును ఆశించక ఉపకారము చేసే తత్త్వమునకే ప్రేమ అని పేరు. కనుకనే, భగవద్గీతయందు సుహృత్ అన్నాడు. భగవంతుడే నిజమైన స్నేహితుడు. నీ నుండి ఎట్టి ఫలితము తాను ఆశించక, అన్ని సమయములందు నీకు తోడునీడగా ఉండి నీయొక్క వాంఛలను నెరవేరుస్తూ వస్తున్నాడు. అతను ఏ ఫలమును ఆశించటం లేదు. ఒక తల్లికూడ కుమారుని తాను పెద్దవాడై తన వృద్ధాప్యములో నన్ను సాకుతాడని అపేక్షచేతనే కుమారుని ప్రేమిస్తుంది. తండ్రికూడా అదేవిధముగా ప్రతిఫలాపేక్షచేత కుమారుని ప్రేమిస్తుంటాడు. కాని, భగవంతునియందు స్వార్థరహితమైన ప్రేమ ఉండటం చేత ఈ ఒక్కటి మాత్రమే సుహృత్ అనే పదమునకు సరైన అర్హత. కాని, ఈ ప్రేమతత్త్వాన్ని చక్కగా అర్థము చేసుకోవాలి. ప్రేమకు నానార్థములు పెంచి, అనర్థములు స్వీకరించి, యదార్థమును విస్మరించి దుఃఖమునకు గురౌతున్నారు మానవులు. ఈ ప్రేమకు నానార్థములు లేనేలేవు. ఒకే అర్థము. ఇదే హృదయానికి హృదయము. ఇలాంటి స్వార్థరహిత ప్రేమను గుర్తించుకోలేకపోతున్నారు ప్రపంచములోని ప్రజలు.

*ప్రతిఫలాపేక్ష లేని ప్రేమయే నిజమైన ప్రేమ*

ఒకానొక సమయంలో ధర్మరాజు రాజ్యమును వదలి ద్రౌపదీ సమేతుడై హిమాలయములలో కాలము గడుపుతున్నాడు.

జానెడు పొట్ట నింపుకొన చిక్కులనొందుచు కోటి విద్యలన్
పూనికమీర నేర్చి పరిపూర్ణసుఖంబును పొందలేక యీ
మానవజాతి దుఃఖముల మ్రగ్గగనేటికి శ్రీపరాత్పరున్
ధ్యానముజేయు భక్తులకు దారినిజూపకయున్నె మానవా!

కంటిధారలు కార్చుకుంటూ, 'నాథా! వేలమందికి అనుకూలములు గావించి, అన్నమును ప్రసాదించి, దురి&భక్షమును దూరము చేసి, ధర్మమును కాపాడుతూ దానము చేసిన నీకు ఈ కష్టములకు ఏమిటి కారణము? సాక్షాత్ ధర్మస్వరూపము నీకా యిట్టి కష్టములు రావటం. పట్టెడన్నముతో పొట్ట నింపుకోలేకపోతున్నారుకదా యిప్పుడు. ఈ కఠినమైన జీవితాన్ని కారడవులయందు గడపటానికి కారణము ఏమిటి? భగవంతుని అనుగ్రహము లేకపోవటమా? నీ భక్తి దోషమా? ' అని ప్రశ్నించింది. ధర్మజుడు చిరునవ్వు నవ్వుతూ,' ద్రౌపదీ! చూడు ఈ హిమాలయ పర్వతములు ఎంత అందముగా ఉంటున్నాయి. ఈ అందమైన పర్వతములు నాకేమి ఆనందమునందిస్తున్నాయి. నాకు ఏ ఫలితము నందిస్తున్నాయి. నాకు సహాయము చేస్తున్నాయి? ఏమీ చేయటం లేదు. కాని, వాటిని చూసిన తక్షణమే నాకు ఆనందము ఆవిర్భవిస్తుంది. అందమే ఆనందము. ఆనందమే జీవిత మకరందము' అన్నాడు. అందమే ఆనందమునిస్తుంది. దానికి మించిన ఆనందము మరొకటి లేదు. ఒక పుష్పము చూసిన తక్షణమే పుష్పము మనకు ఏమీ సహాయము చేయటం లేదు. మనకు అనుకూలము చేయటము లేదు. కాని, పుష్పము చూసిన తక్షణమే ఎంతో ఆనందము వేస్తుంది. భగవంతుడు ప్రకృతి స్వరూపుడు. ఈ ప్రకృతిని చూసిన తక్షణమే ఆనందము వస్తుంది. ఈ ఆనందము నిమిత్తమే అతనిని నేను ప్రేమిస్తున్నానుగాని ప్రతిఫలాపేక్షతో కాదు. కనుకనే, వేదము 'నకర్మణా నప్రజయా ధనేనత్యాగేనైకే అమృతత్త్వమానశుః' అనింది. ఈ త్యాగ భావముచేత ఈ ప్రేమస్వరూపని చూసినప్పుడే మనకు అన్ని ఫలితములు చేకూరుతాయి. కనుక, భగవంతుని ప్రేమించుటే నిజమైన ప్రేమగాని ప్రతిఫలాపేక్షతో ప్రేమించేది కాదు. ప్రేమనిమిత్తమై ప్రేమ. నా ప్రేమ వాణిజ్య పదార్థము కాదు. ఈ ప్రాకృత వస్తువాహనాదులందు, లౌకికమైన జీవితమందు వచ్చిపోయే సుఖదుఃఖములు కేవలము కదిలిపోయే మేఘములవంటివి. ఈ దేహముతో కూడిన ఆనందము సరైన ఆనందము కాదు. దేహమే అశాశ్వతము. అలాంటి అశాశ్వతమైన దేహముతో అనుభవించే ఆనందము శాశ్వతము ఎట్లా అవుతుంది? ఈ దేహములు మార్పుచెందేవి. మార్పు చెందటమే కాదు మాలిన్యముతో కూడినది. ఇది,

మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవకగంప జాతసం
చలనముపొందు దుంప భవసాగరమీదగలేని కంప అం
బుంబులపొది లెమ్ము చూడ మన ముప్పుదలంపగ దేహమింక ని
శ్చలమని నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే.

అతని పాదములు చింతించు.

నిద్దురనుండి లేచి మరి నిద్దుర పోయెదుదాక పొట్టకై
హద్దును పద్దు లేక వ్యయమందగ జేయుచు జీవితంబు నీ
విద్దెల ధారపోసి అరవింద దళాక్షుని విస్మరించి ఏ
పెద్ద సుఖంబు నొందితివొ ప్రీతిగ యోచనచేయు మానవా!

ఏమి సాధించావు? సాధించవలసినది భగవంతుని ప్రేమ. అతని ప్రేమ ఒకటి ఉండెనా సర్వమూ సాధించవచ్చు. కనుక, ఆ ప్రేమనిమిత్తమూ చింతించు. లౌకికమైన, క్షణభంగురమైన కష్టములకు నీవు చింతించనక్కరలేదు. ఇది సరైన మార్గము కాదు.

*దైవానందము వాక్కులకు మనస్సుకు అందనిది*

భారతీయ వేదాంతము ప్రాచీనకాలమునుండి యిలాంటి సత్యమునే బోధినిచి అనేకవిధములైన ఆనందమునందిస్తూ వచ్చింది.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబుజూడ యా
దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!

ఆ దైవత్వము పొందే నిమిత్తమై నీవు చితించు. ఆ దైవత్వముయొక్క ఆనందము యిట్టిది అట్టిది అని ఎవరూ వర్ణించ లేరు. అవాఙ్మానస గోచరమైనది. 'యతోవాచోనివర్తంతే అప్రాప్యమనసాసహ' మనస్సుకుకాని, వాక్కునకుగాని అందలేనిది ఈ ఆనందము. ప్రాకృతమైన ఆనందము పరిమితములో కూడి ఉంటుంది. ప్రాకృతమైన సంబంధము పరిమితముతో ఉంటుంది. ఇది పరిమితమునకు మీరినది. అతీతమైన తత్త్వము. అదియే దైవానందము. అదియే నిత్యానందము. అదియే యోగానందము. అదియే అద్వైతానందము. కాని, ఈనాటి సాధకులు కూడ క్షణభంగురమైన, తుచ్ఛమైన ఆనందముల నిమిత్తమై అనేకవిధములైన సాధనలు సల్పుతున్నారు. సాధన అని చెప్పటం చాలా అవమానమే. సా..ధన ధన అనగా ప్రయత్నముతో మనం సంపాదించుకున్నది. విద్య ఒక ధనమే. ఆరోగ్యము ఒక ధనమే. మన సర్వశక్తులు ధనమే. ధనకనకవస్తువాహనాదులు ధనమే. ధనమనగా ఏమిటి? మానవ జీవితములో సాధించినవి ధనములు. సాధనలతో సాధించినవి సాలోక్యసారూప్యసాయుజ్యములు అనే సకారములు. దైవత్వముతో సాధించిన ధనమే నిజమైన ధనము. అట్టి ధనమునందించే నిమిత్తమై యుగయుగములందు దైవము అవతరిస్తుంటాడు.

యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్.

*భగవంతుడు కాలస్వరూపుడు*

కృతయుగము వైశాఖ మాసంలో ప్రారంభమైంది. త్రేతాయుగము మాఘమాసంలో ప్రారంభమైంది. ద్వాపరయుగము మార్గశిరమాసములో ప్రారంభమైంది. అందువల్లనే మాసములలో మార్గశిరము నేను అన్నాడు. కలియుగము చైత్రమాసంలో ప్రారంభమైంది. ఈ చైత్రము చంద్రమానములోనిదిగాని సూర్యమానములో కాదు. యుగమనగా ఏమిటి? యుగమనగా దైవత్వమని అర్థము. దైవత్వముతో ప్రారంభమై దైవత్వముతోనే అంతమయ్యేది యుగము. యుగములు భగవంతుని సృష్టి. యుగములకు ఆది ఉగాది. పోషించేవాడూ తానే. కాలస్వరూపుడే తాను. కనుకనే, భగవంతుడు ఆత్మ అనేదానిలో కాలముతో కూడినవాడు. కాలాత్మ అని పిలుస్తూ వచ్చారు. కాలము కాయాన్ని మింగుతుంటే కాలమును మింగేవాడు భగవంతుడు. కాలము అతని స్వాధీనమందున్నది. దైవమునకు 'సంవత్సరాయనమః' అని పేరు పెట్టారు. సంవత్సరమనగా భగవత్స్వరూపుడు అని అర్థము. దైవముతో ప్రారంభమైనదే యుగము. దీనికి అంత్యమే లేదు. ఇలాంటి అంత్యములేని, అమృతమైన, అమరత్వమైన, దివ్యమైన సంవత్సరమునకు ఒక దినము సంవత్సరము ప్రారంభమైనట్లుగా భావించటము అల్పత్వమే.

*హరి కావాలిగాని సిరి కాదు*

ఈనాడు ఉగాది ప్రారంభమైనదని భావిస్తున్నాము. కలి అనగా ఏమిటి? కలి అనగా భయంకరమైనదిగాను, కొన్ని కష్టములకు గురిచేసేదిగాను భావిస్తున్నారు. కాదు కాదు. కలికాలము నామస్మరణతో కూడినది.

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్
*కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా.*

ఈ కలియుగమందు నామస్మరణకు మించినది మరొకటి లేదన్నారు. కలి అనగా నామముతో చేరినది. కాని, ఈనాటి మానవుడు హరినామము విస్మరించాడు. సిరి నామము స్మరిస్తున్నాడు. సిరి అభీష్టము కలిగిన వారు అధికముగా ఉన్నారుగాని హరి

అభీష్టము కలిగినవారు తక్కువ. మనకు హరి కావాలిగాని సిరి కాదు. హరి ఉంటే సిరి మన వెంటే వస్తుంది. సర్వమునకు భగవంతుడే మూలకారణము. ఇలాంటి మూలాధారమైన దైవత్వాన్ని మనము స్మరిస్తూ రావాలి.

**హృదయము మంచిదైతే ఏ యుగమైనా మంచిదే**

ఈ ప్రాకృతమైన యుగమునందు ఈనాటి సంవత్సరమునకు యువ అని పేరు వచ్చింది. యువ అనగా మధ్యవయస్సు వున్న వానిని యువ అంటారు. యవ్వనములో ఉన్నవారిని యువ అంటారు. మధ్యలో వచ్చిపోయేదే. యవ్వనత్వము ప్రారంభమునుండి రాదు. అంత్యము వరకు ఉండదు. వచ్చి పోయేది. ఇది యువనామ సంవత్సరము. ఐతే యువనామ సంవత్సరములో ఎలాంటి ఫలితములుంటాయి అని ప్రజలలో ఆపోహలు, ఆందోళనలు ఉంటాయి. అనేకమంది అనేక భయములు చెప్పి మానవుని మరింత భయపరచి వారిని నిరుత్సాహపరచటం మంచిది కాదు. జ్యోతిషశాస్త్రము పురస్కరించుకొని యువనామ సంవత్సరము శనిలో ప్రారంభమైంది. కాని, గురుడు మంచివాడుగా ఉన్నాడు. అతనే రాజు. రాజు మంచివాడుగా ఉన్నప్పుడు మంత్రులు ఎలాంటివారైనా ఫరవాలేదు. రాజు వీరందరినీ కంట్రోలు చేస్తాడు. గురువు రాజు. ఏ భయము పడనక్కర లేదు. ఐతే ప్రపంచములో సుఖములు, దుఃఖములు, కష్టములు, నష్టములు జరుగుతూనే ఉంటాయి. కృతయుగములో మాత్రం బాధలు లేవా! త్రేతాయుగములో కష్టములు సంభవించలేదా! ద్వాపరయుగములో యుద్ధము జరగలేదా! కాదుకాదు. యుగమనేది ప్రత్యేకముగా చూచుకోనక్కరలేదు. కృతయుగమందుకూడా కలియుగ పురుషులున్నారు. కలియుగమందుకూడా కృతయుగ పురుషులుంటారు. యుగములు దీనికి మూలకారణము కాదు. హృదయమే మూలకారణము. మన హృదయము మంచిదైతే ఏ యుగమైతే మనకేమి? హృదయాన్ని పరిశుద్ధ పరచుకునే మార్గము ప్రయత్నపూర్వకంగా సాధించాలి. దీనినే హృత్..దయ అన్నారు. దయతో కూడిన హృదయము కావాలి. కఠిన హృదయము ఉండకూడదు. కనుక, ఈ కఠిన హృదయమును దూరము చేసుకొని కరుణ హృదయాన్ని పెంచుకోటానికి కృషి చేయాలి.

*గమ్యాన్ని చేరటానికి ఎవరికి వారే నడవాలి*

కాని, ఈ సంవత్సరంలో మంచిచెడ్డలు రెండూ మనం తలచవలసిందే. ప్రమాదములు చాలా ఏక్కువ ఉంటాయి. అల్లకల్లోలములు అధికంగా ఉంటాయి. రాజకీయమైన బాధలు చెప్పటానికి వీలుకాదు. కనుక, ఎవరికి వారు పవిత్రమైన హృదయాన్ని పెంచుకొని తనను తాను రక్షించుకోటానికి కృషి చేయాలి. గురువు నిన్ను గమ్యాన్ని చేర్చలేడు. దైవము నిన్ను గమ్యాన్ని చేర్చలేడు. గ్రంథములు నిన్ను గమ్యాన్ని చేర్చలేవు. గమ్యాన్ని చేరటానికి నీకు నీవే నడవాలి. గైడ్ పోస్టు ఉంటుంది. ఈ గ్రామమునకు ఇది మార్గము అని చూపటమే దాని తత్త్వముగాని నడిపించటం దానియొక్క స్థితి కాదు. ఇందులో ఎవరికి వారే స్వశక్తి చేత సుఖాన్ని, ఆనందాన్ని పొందటానికి ప్రయత్నించాలి. మన ఆత్మను మనం రక్షించుకోటానికి చూచుకోవాలి. ఎవరికి వారు సరైన గుణము కల్గి ఉండాలి. ఎన్ని బాధలు వచ్చినా సులభంగా ఎదుర్కోవచ్చు. దైవానుగ్రహమునకు తగిన కృషి చేయాలి. దైవ ప్రార్థనలు మనం సల్పాలి. యువకులు జాగ్రత్తగా ఉంటుండాలి ఈ సంవత్సరములో. మనస్సును అదుపులో ఉంచుకోవాలి. క్షణములో కోపము, క్షణములో అసూయ అభివృద్ధిగావించుకోరాదు. క్షణములో వచ్చి క్షణములో పోయే క్రోధము చాలా ప్రమాదము. క్రోధాన్ని చాలావరకు చంపుకోటానికి ప్రయత్నించాలి. అసూయ మరింత నయముగాని రోగము. క్యాన్సర్ వ్యాధికి నివారణ ఉందిగాని అసూయకు నివారణ లేదు. అసూయకు యేమాత్రము గురికాకూడదు. అసూయచేత మనకు అనేకరకముల బాధలు సంభవిస్తున్నాయి.

*నమ్మిన వారికి దేవుడు... నమ్మని వారికి యముడు*

భగవంతుడు ఎవరు? ఎక్కడున్నాడు ధర్మస్వరూపుడు? యముడెవరు? ఎవరు రాముడు? అని మనం చక్కగా విచారణ చేస్తే, పురందరదాసు చెప్పాడు, 'నమ్మని రావణునికి యముడు రాముడు, నమ్మిన విభీషణునికి రాముడే దేవుడు. నమ్మని కంసునికి కృష్ణుడే యముడయ్యాడు. నమ్మిన అక్రూరునకు తాను దేవుడయ్యాడు. నమ్మిన ప్రహ్లాదునకు నారాయణుడుగా కనిపించాడు. నమ్మని హిరణ్యకశిపునకు యముడుగా కనిపించాడు. యముడు వేరు రాముడు వేరుకాదు. దేవుడు వేరు యముడు వేరు కాదు. యముడు ప్రత్యేకంగా, దేవుడు ప్రత్యేకంగా లేడు. వారి భావముల దోషములకే యముడుగా మారుతున్నాడు. వారి భావముల మంచికే దేవుడుగా మారుతున్నాడు.

'యస్' అనువారికి 'యస్' అనురా
'నో' అనువారికి 'నో' అనురా
'నో','యస్'లు మీ నోటికిగాని
సాయికి సర్వం 'యస్,యస్,యస్'.

మన హృదయములోనున్న దోషములే యస్ నోలుగాని భగవంతునికి యస్ నోలు లేవు. ఎలాంటి యుగమైనప్పటికి, ఎలాంటి సంవత్సరము ప్రారంభమైనా మన హృదయములోపల కరుణను పెంచుకోవాలి. దైవచింతన అభివృద్ధి పరచుకోవాలి. దైవచింతన ఒక్కటుంటే ఏదైనా సాధించవచ్చు.

కృతఘ్నుత మహాపాపం

ఈ కొత్త సంవత్సరం చైత్రమాసమందు చిత్రవిచిత్రమైన బాధలు సంభవిస్తున్నాయి. ఒక్క క్షణములోనుండిన మంచితనము మరొక క్షణములో మారిపోతున్నాది. ఉపకారియే అపకారిగా మారిపోతున్నాడు. ఇది చెప్పటానికి సాధ్యముకానటువంటిది. ఎన్ని ఉపకారములు చెసినప్పటికి ఆ ఉపకారము మరచిపోవటమే కాకుండా దానికి విరుద్ధమైన అపకారమునకు పాల్పడుతున్నారు. మీకందరికీ తెలుసు గోరీమహమ్మదు. అతను అనేక పర్యాయములు మన దేశముపై దండెత్తి ప్రజలకు హాని కల్గించాడు. కట్టకడపటికి పృధ్వీరాజుపై దండెత్తి వచ్చాడు. కాని, పృధ్వీరాజు గోరీని పట్టివేశాడు. అతని ప్రార్థన మన్నించి అతనిని తిరిగి వదలిపెట్టాడు. వదలి పెట్టిన ఈ గోరీ తిరిగి ఆరు పర్యాయములు పృధ్వీరాజుపై దండెత్తి వచ్చాడు. ఆరు పర్యాయములూ క్షమించి అతనిని వదలివేశాడు. కాని, ఏడవ తూరి పృధ్వీరాజు మామతో స్నేహము గావించుకొని, అతని సహాయముచేత పృధ్వీరాజుపై దండెత్తి వచ్చాడు. పృధ్వీరాజు ఓడిపోయడు. ఏడు పర్యాయములు క్షమించి వదలిపెట్టిన పృధ్వీరాజుపైన ఎంత కృతజ్ఞత ఉంటుండాలి. పృధ్వీరాజు ఓడిపోయేటప్పటికి గోరీ పృధ్వీరాజు కన్నులు తీసివేశాడు. కృతజ్ఞత లేకపోవటమేకాక కృతఘ్నుడుగా మారిపోయాడు. కాని, సమయం వచ్చినప్పుడు ఆ కృతఘ్నుడుగా మారిపోయాడు. అనేకమంది సూర్యనమస్కారములు చేస్తుంటారు. ఓ సూర్యుడా! నీవు చూచిన తక్షణమే మంచు కరిగిపోతుంది. తమోఘ్నాయనమః, నీవు వచ్చిన వెంటనే చీకటంతా దూరమైపోతుంది. అంతేకాదు. నీవు అందరి నేత్రములందు తేజస్సుగా ఉన్నావు. అపకారము చేసేవానికి ఒకనాడు కన్నులు తీసివేస్తావు. కృతజ్ఞుడుగా ఉంటే ఎంతో భగవదనుగ్రహం ఉంటుంది. కృఘ్నుడుగా మారకూడదు. ఉపకారమునకు అపకారము చేయపూనుకోకూడదు.

చెరపకురా చెడెదవు

ఒకనాడు పృధ్వీరాజు మంత్రి గోరీ దగ్గర చేరి, ‘పృధ్వీరాజు సామాన్యుడు కాదు. శబ్దవేధి బాగా నేర్చినవాడు. శబ్దమునుబట్టి అంబును వదలగలడు. కన్నులు లేవని నీవు భావిస్తున్నావు. చాలా పొరపాటు. చర్మచక్షువులు లేవుగాని జ్ఞానచక్షువులుంటున్నాయి అతనికి’ అని చెప్పి గోరీని ఒక సింహాసనముపై కూర్చోపెట్టి ప్రక్కనే గంటను పెట్టి, దూరముగా పృధ్వీరాజును పెట్టి దీనిని కొట్టిస్తానన్నాడు. నూరు అడుగుల దూరంలో పృధ్వీరాజును కూర్చోబెట్టారు. గోరీమహమ్మదు దగ్గర గంట పెట్టారు. గంట కొట్టేటప్పటికి శబ్దమునుబట్టి పృధ్వీరాజు అంబును విడిచాడు. ఆ గంట ముక్కలైంది. ఆశ్చర్యముగా చూసాడు గోరీ. మంత్రి కొన్ని చిహ్నములు చెప్పి ఉండవచ్చని సందేహపడ్డాడు. మానవునికి అనుమానములు, సందేహములు అధికంగా ఉంటుంటాయి. అన్నింటికీ అనుమానమే. తనను తానే నమ్మలేనివాడు పరులను ఎట్లా నమ్మగలడు. నాలుగు నిముషాలైనా తనను తాను నమ్మ లేడు. మరొక తూరి ఈ గంట కొట్టాడు. తిరిగి ముక్కలు చేశాడు. ఈవిధంగా చేస్తే గోరీమహమ్మదుకు అహంకారము ఎక్కువైపోయింది. ఇతని ప్రాణములే తీయాలనుకున్నాడు. కనులు తీయటం నేను పొరపాటు చేశాను. ప్రాణం తీయాలనుకున్నాడు. పృధ్వీరాజు భగవంతుని స్మరించాడు. మరొక పర్యాయము గంట తెచ్చి పెట్టాడు. కొట్టేటప్పటికి భగవంతుని అనుగ్రహము , ఉపకారమునకు అపకారము చేసే ఈ కౄరునికి ఏవిధంగా చేయాలనే ఉద్దేశ్యంతో అతని చేతిలో చేరాడు భగవంతుడు. అతను కొట్టేటప్పటికి నేరుగా వచ్చి అతని కంఠములో పడి ప్రాణము విడిచాడు. దైవచింతన ఎంత సహాయముగా ఉంటుందో చూడండి. ఆ సభలోనే పృధ్వీరాజును చంపటానికి సిద్ధమయ్యాడు. చెరపకురా చెడెదవు, ఇతరులను మనం చెడపటానికి ప్రయత్నం చేసినప్పుడు దైవం మనలనే తెరుపుతాడు. ఊరి బిడ్డను నగరివాడు కొడితే నగరి బిడ్డను నారాయణుడు కొట్టాడట. నీవు ఎవరినో కొడుతుంటే దేవుడు నిన్ను కొట్టడా!

**అనుమానం త్రుంచుకోవాలి..విశ్వాసం పెంచుకోవాలి**

యద్భావం తద్భవతి. మన మంచియే మనలను కాపాడుతుంది. ఎవరినీ మనము చెడ్డగా భావించ రాదు. ఎవరిపైనా చెడ్డ తలంపులు అభివృద్ధి చేసుకోకూడదు. ఎవరికీ చెడుపు మనం చేయరాదు. సాధ్యమైనంత వరకు మంచి చేయాలి. మనసులో ఉండిన అనుమానములు నిర్మూలము చేయాలి. విశ్వాసము పెంచుకోవాలి. ఈనాటి మానవునియందు విశ్వాసమే లేదు. దేనియందు లేదు. భార్యను చూస్తే అనుమానం, తనను చూస్తే అనుమానం. అన్నీ అనుమానములే. ఈవిధంగా అనుమానం కలిగే మనిషి ఎంత కాలం బ్రతకగలడు. దైవవిశ్వాసం పెంచుకోవాలి. ఆ దైవవిశ్వాసం ఉన్నంతవరకు ఏ ద్రోహము, ఏ కలి హింసించదు.

**ఏవి నిజమైన అలంకారాలు**

మనం సత్యావాక్కుచేత, దానచేతులచేత, మంచి శ్రవణం చేత కలిని మనం జయించటానికి ప్రయత్నించాలి.

హస్తస్య భూషణం దానం సత్యం కంఠస్య భూషణం
శ్రోత్రస్య భూషణం దివ్యనామం కలిః కింకరోతి.

దీనికంటె గొప్ప అలంకారం మరేమి కావాలి? కంఠమునకు నెక్లెసు కాదు అలంకారము, కంఠమునకు సత్యమే అలంకారము. చేతికి కంకణాలు కాదు అలంకారము, దానమే అలంకారము. చెవులకు కమ్మలు కాదు అలంకారము, భగవన్నామాన్ని వినటమే అలంకారము. ఈ అలంకారమునకు మించిన అలంకారము లేదు. ఇదే మనం సంపాయించు కోవలసినది. దీని వలనే మన జన్మ సార్థకమవుతుంది. మానవుడు ఎందుకోసం వచ్చింది? ఎందుకోసం పుట్టింది? తనటంకోసం పుట్టాడా? ధనము సంపాయించటం

కోసం పుట్టాడా? మిద్దెలు, మేడలు కట్టడానికి పుట్టాడా? అన్నీ ఉండవలసిందే. నా రహస్యమేమిటో, మానవ జీవితమేమిటో, నా కర్తవ్యమేమిటో అనే ప్రశ్న వేసుకొని ఆదర్శవంతమైన జీవితము జగత్తునకందించాలి. ప్రతిమానవునికి విలువ ఉంటున్నది. తన జీవితములో సాధించవలసిన కర్తవ్యములు కొన్ని ఉంటున్నాయి. కర్తవ్యకర్మలు ఆచరించి మానవత్వమును సార్థకము చేసుకునే పనులు మనం చేయాలి.

**అనేకత్వంలోని ఏకత్వం భావించాలి**

అనీల్‌కుమార్ చెప్పాడు. నేను పశువును కాదు, మనిషిని అనుకోవచ్చు. నీవు మనిషి కాదు దైవమని అనుకోవచ్చు. అయ్యా నీవు దేవుడు, నేను నరుడు. నేను అల్పజ్ఞుడను, నీవు అధికమైనవాడవు అని పోలికలు చేస్తూ వచ్చాడు. నేను నీవే, నీవు నేనే. నీ దేహమందు ఏది ఉన్నదో నా దేహమందు అదే ఉన్నది. 'ఈశ్వస్సర్వభూతానాం' ఏకాత్మ భావము నీయందు నాయందు ఉంటున్నది. ఈ దేహము ఎంత పంచభూతములో ఆ దేహము అంత పంచభూతములే. రెండు సమానమే కదా! ఇంక భిన్నత్వము ఎక్కడుంది? అనేకత్వములోని ఏకత్వం మనం భావించాలి.

nations are many but earth is one
beings are many but breath is one
jewels are many but gold is one.

ఏకత్వాన్ని మనం సంపాయించాలంటే దైవము ప్రత్యేకముగా లేదు. దేహము నడిచే దేవాలయము అన్నారు. నడిచే దేవాలయమన్నప్పుడు ఎవరు నడిపిస్తున్నారు? ఆ దైవమే నడిపిస్తున్నాడు. అది తనలోనున్న వైబ్రేషన్. ఎక్కడ నడవాలి? తెలివితేటలు, అది రేడియేషన్. ఈ రేడియేషన్, వైబ్రేషన్ రెండూ ఉపయోగపెట్టుకొని చేసే పని దేహమే మెటీయర్రైలేజషన్. భూర్భువస్సువః ఈమూడూ నేనే. భువర్లోకం, సువర్లోకం అంటే ఎక్కడో ఉంటున్నాయని కాదు. భూలోకము ఈ దేహమందే, భువర్లోకమనే ప్రాణము, సువర్లోకమనే జ్ఞానము ఈ దేహమందే చేరి ఉంటున్నాయి. కనుక, మనం ప్రత్యేకంగా విచారించనక్కరలేదు. సర్వమూ మనయందే ఉంటున్నాయి. చిన్న అద్దము లోపల కొన్ని వేల మైళ్లలోని నక్షత్రాలు మనం చూగలుగుతున్నాం. అదేవిధముగా ఈ చిన్న దేహములోనే విశ్వమంతా యిమిడి వున్నది. ఇదే సృష్టి రహస్యము. ఈ రహస్యము మనము ఒక్కతూరి విచారణ చేస్తే భగవంతుడు ఎంత గొప్పవాడో తెలుస్తుంది. నాలుకపైనున్న రక్తమే దేహమంతా ప్రసరిస్తూ ఉంటున్నాది. నాలుకపైనా ఒకే రక్తము, హస్తముపైన ఒకే రక్తము. కాని, లడ్డు తీసుకొని నాలుకపై పెడితే తీపి చెబుతుంది, కాని, చేయి చెప్పలేదు. ఒక్కొక్క స్థానములో ఒక్కొక్క విలువను సృష్టిస్తూ వచ్చాడు. కన్నులు చూడగలవేగాని వినలేవు. చెవులు వినగలవేగాని చూడలేవు. నోరు తినగలదేగాని వినలేదు. ఒక్కొక్క దానికి ఒక్కొక్క శక్తి నందించి కర్తవ్యమును నిర్వర్తించటానికి తగిన కృషి చేస్తూ వస్తున్నాడు. సృష్టి రహస్యము ఎంత రహస్యము. ఇది ఎవరు చేయగరు? ఎవరి చేతనవుతుంది? ఇది అసాధ్యము. ఒక్క దైవానికే సాధ్యము.

**జంతూనాం నరజన్మ దుర్లభం**

అట్టి దైవము అనుగ్రహము చేత మనము సాధించలేనిది ఒక్కటీ లేదు. పురుష ప్రయత్నమనేది నిమిత్తముగా పెట్టుకోటమే గాని కెవలము ఒక పనిముట్టు. నా దేహము, నా మనస్సు, నా బుద్ధి పనిముట్లు. కరణములు. నీవు దానికి మాష్టరు. ఆ భావాన్ని మీరు విశ్వసించాలి. అన్నింటికి అన్నింటికి ఆత్మ అనే మాష్టర్ ఉన్నాడు. ద్రోహము చేయరాదు. మోసము చేయరాదు. అతనికి మనం కృతజ్ఞులుగా ఉండాలి. ఇలాంటి పవిత్రమైన, విలువైన దేహాన్ని మనకందించాడు. ఎంత పవిత్రమైనది! అందువలనే జంతూనాం నరజన్మ దుర్లభం. మానవ జన్మ ఎంత దుర్లభమైనది. పుట్టిన వెంటనే ఎవరైనా నేర్చుంకుంటున్నారా విద్యలు? క్రమక్రమేణా అబ్బుతున్నాయి ఈ విద్యలు. దీనికి ఒకరుండాలి. నల్లబల్లపై ఎ, బి, సి అని వ్రాసారు. అక్షరాలు కనిపిస్తున్నాయిగాని ఏ అక్షరము ఏ శబ్దము పలకాలని ఒకరు చెప్పాలి కదా! ఇది ఎ అని చెప్పేవారుండాలి కదా!

పూలు, సూది, దారముంది పుష్పమాల తానగునా!
వజ్రముంది, బంగారుంది నగలు చేసేవాడుండాలికదా!
ప్రమి, వత్తి గలదు దీపము వెలుగునా!

వెలిగించేవాడు ఒకడుండాలికదా! భూర్భువస్వః ఈమూడు ఉంటున్నాయి. దీనిని నడిపించేవాడు ఒకడుండాలి. వాడే దైవం. ఆ దైవము సర్వులయందు ఉంటున్నాడు. హేతువాదులు అనేక రకములుగా వాదిస్తుంటారుగాని అర్థము లేని వాదన. దైవము లేకుండా ఏదీ జరగదు. అన్నింటికీ దైవము ఉండాలి. దైవవిశ్వాసము మనం పెంచుకోవాలి.

**లోకాస్సమస్తాః సుఖినోభవంతు**

ప్రాచీన కాలమునుండి భారతదేశ ఆధ్యాత్మిక సంపత్తిని అన్ని దేశములకు అందించిన దేశము ఈ భారతదేశము. నాటి మొదలు నేటి వరకు లోకాస్సమస్తాః సుఖినోభవంతు అని విశాలంగా భావించేది భారతీయ సంస్కృతి. ఇట్టి పవిత్రమైన సంస్కృతిని మనం ఉంచుకొని, ఆదర్శములంతా మనలో ఉండినప్పటికిని తనను తాను తెలుసుకోలేక పోతున్నాడు. కారణము ఏమిటి? ఈనాటి విద్యలయొక్క ప్రభావము. ఈనాటి సంఘదోషము. దీనివలనే మనలోని దివ్యత్వాన్ని మనం మరచిపోతున్నాము. మీకు తెలుసు.

చాలామంది విద్యార్థులున్నారు. న్యూటన్ ఎట్లా ఈ భూమికి ఆకర్షణశక్తి ఉంది అన్నాడు. విచారణ చేస్తూ ఉండేవాడు ఎప్పుడూ. చెట్టునుండి కాయ పడింది. ఆకర్షణశక్తి లేక ఆ కాయ ఎట్లా పడింది? ఐతే ఆ కాయ పక్కలో యింకొక కాయ ఉంటున్నాది. అది పడలేదే? ఒకటి మాత్రమే ఎందుకు పడింది? దీనికి ప్రత్యేకముగా పరిశోధనలు చేస్తూ వచ్చాడు. ఇది ఫలము. పండింది. అది యింకా ఫలము కాలేదు. అది పడలేదు. అన్నింటిని ఆకర్షించేదికాదు భూమి. ఫలమైన దానినే ఆకర్షిస్తుంది.

**దైవత్వమే అన్ని శక్తులకు మూలము**

ఒక భూమికే కాదు ఆకర్షణ. మన దేహమంతా అయస్కాంతమే. మన దేహములో విద్యుత్ ఉంటున్నాది. ఇంతే కాదు. ఒకవిధమైన వైబ్రేషన్ ఉంటున్నాది. రేడియేషన్ ఉంటున్నాది. అంతా మన దేహమందే ఉంటున్నాది. లేకపోతే ఈ ప్రకృతిలో మనం జీవించలేము. నిజంగా ఆధ్యాత్మిక చింతన కల్గినవారికి , మహర్షులకు దేహమంతా చుట్టూ ఫ్లడ్‌లైటు వేసినట్లుగా కనిపిస్తుంది. మన దేహములో అంత శక్తి ఉంటున్నాది. ఈ యోగశక్తి చేత సాధించిన మహనీయులను ముట్టుకుంటే షాక్ కొడుతుంది. అంతటి శక్తి ఉంటున్నాది మానవత్వములో. ఎవరందించారు? ఎక్కడనునిచి తెచ్చారు? కాదు కాదు. దైవత్వమునుంచి ఆవిర్భవించినదే!

**దైవానుగ్రహముంటే ఏ గ్రహమూ బాధించదు**

ఈవిధంగా మనం దైవత్వమునువిచారణ చేస్తూ చేస్తూ పోతే దైవశక్తి ఇట్టిది అట్టిది అని ఎవరూ వర్ణించ లేరు. కనుక, దైవానుగ్రహమునకు సరైన ప్రార్థనలు చేయాలి. ఈ యుగాల గురించి ఏమాత్రమూ విచారించనక్కరలేదు. ఏ యుగమైనా సరే, ఎలాంటి పరిస్థితిలోనైనా ఉండనీ, ఎలాంటి ధర్మాన్నైనా పాటించనీ దైవానుగ్రహము ఒక్కటి ఉంటే సర్వమూ మనము సాధించవచ్చు. త్యాగరాజు చెప్పాడు, 'రామా! నీ అనుగ్రహము ఒక్కటి ఉంటే చాలు. నవగ్రహములు నా హస్తగతమౌతాయి. నీ అనుగ్రహం కావాలిగాని ఈ గ్రహాలు నాకెందుకు?' నవగ్రహములనుకుంటున్నారు. కాదుకాదు. తొమ్మిది లేవు. రెండేరెండు గ్రహాలుంటున్నాయి. ఏమిటా గ్రహములు? అహంకారమమకారములే రెండు గ్రహాలు. ఈ రెండే మనలను పట్టి పీడిస్తున్నాయి. ఈ గ్రహములనుండి విమోచనము కావాలనుకుంటే అనుగ్రహము మనం సంపాయించాలి. అనుగ్రహ బలముంటే ఈ గ్రహములు మనలను యేమాత్రమూ పీడించ లేవు. మీరందరూ యువకులు. ఈ సంవత్సరము చాలా పవిత్రమైన కర్మలలో పాల్గొనాలి. సమాజములో సమస్త రోగములు పరిహారము గావించాలి. ఐకమత్యము పెంచుకోవాలి. ఆడంబరము త్రుంచుకోవాలి. అహంకారము చంపుకోవాలి. అప్పుడే దివ్యత్వము అనే యువకత్వము అభివృద్ధిగాంచవచ్చు.

**దైవబలం కోసం యత్నించాలి**

ఈ యువకులలో ఏకత్వము పోయింది. కారణము ఏమిటి? అహంకారమే మూలకారణము. నేను, నేను. కండలో, కన్నులో కండలున్నంత వరకు మానవత్వము మరచిపోతుంటారు. అందరూకూడా చిల్లిగవ్వ కంటె హీనంగా చూస్తారు. నేను అందరికంటె గొప్పవాడని భావిస్తారు. అది కాదు. వచ్చే కష్టములకు, నష్టములకు, దుఃఖములకు తట్టుకొని నెట్టుకొని ముందుకు సాగటానికి తగిన ధైర్యము మనం సంపాయించాలి. ధైర్యమును మనం వహించాలి. ఏ ధైర్యము? భుజబల ధైర్యం కాదు. బుద్ధిబల ధైర్యం కాదు. అంగబలం కాదు. మొండిబలం కాదు. దైవబలం. ఆ దైవబలం వచ్చినప్పుడే నీవు అన్నింటినీ సాధించగలవు. మీరందరూ దైవబలముకోసం ప్రయత్నించండి.

**సంకుచిత భావాన్ని వదలాలి విశాలభావాన్ని పెంచాలి**

సర్వదేశములు కూడా సుక్షేమంగా ఉండాలని ప్రార్థించండి. నా భారతదేశము అనే సంకుచిత భావానికి చోటివ్వకండి. అందరూ మానవులే. all are one be alike to everyone. అందరిని మనం ప్రేమిస్తూ రావాలి. ఏ దేశమువారైనా భగవంతుని బిడ్డలే కదా! దేశములు వేరువేరుగా ఉంటున్నాయిగాని, మానవుల రంగులు వేరువేరుగా ఉంటున్నాయిగాని మానవజాతి ఒక్కటే! ఆ జాతి సంరక్షణ కోసం పాటుపడాలి. యువకులలో సంకుచిత భావాన్ని చంపుకోవాలి. విశాలభావము పెంచుకోవాలి. ఈ సంవత్సరము ప్రేమను పెంచుకోటంలో యువకులందరూ తగి కృషి చేయాలి. ఇది నా దేహము అన్నప్పుడు దీనిపైన ఎంత అభిమానము, ఎంత ప్రేమ, ఎన్నివిధములైన క్షేమాన్ని ఆశిస్తుంటాము. ఈ దేహమే కాదు, ఆ దేహముకూడా నాది అనుకుంటే యింక ఎంత ఆనందము వస్తుంది. అన్ని దేహములు నీవనుకుంటే పట్టలేని ఆనందము వస్తుంది. అన్ని దేహములలో నేనే అనే భావన పెట్టుకుంటే యింతకంటె సాక్షాత్కారము ఏమి కావాలి.

**అన్ని దేహములు దైవానివే**

ఇదే రామకృష్ణపరమహంస అంత్యములో చెప్పుతూ వచ్చాడు. కంఠములో క్యాన్సర్ వచ్చింది. ఆహారము లోపలకు పోలేకుండా ఉంది. నరేంద్రుడు వచ్చాడు. ఆహారముకూడా లోపలకు పోలేకుండా ఉందికదా, నీవెందుకు తల్లిన తీఅడగకూడదు? తల్లీ నాకింత ఆహారము లోపలికి పోయేటట్లు చేయమని ప్రార్థించకూడదా. రామకృష్ణుడు నవ్వాడు. అడిగినాను నాయనా, అమ్మను అడిగినాను. జవాబుకూడా చెప్పింది. ఏమి చెప్పింది? ఇన్ని నోళ్లతో తింటుంటే ఒక నోటితో తినకపోతే నష్టమేమిటంది. ఇన్ని నోళ్లతో తింటున్నప్పుడు ఒక్కనోటితో తినకపోతే ఏమి? అందువలన సిగ్గు వచ్చింది. ఇంక అమ్మను అడగను. అనగా ఏమిటి? అన్ని

దేహములు అమ్మవే, అన్ని కంఠములు అమ్మవే!

**దైవం నీలోనే ఉన్నాడు**

అహం వైశ్వానరోభూత్వా ప్రాణినాదేహమాశ్రితా. నేను ప్రతి మానవుని వీదరములో వైశ్వానరుని రూపములో ఉండి వారు తిన్నదంతా జీర్నింప చేస్తున్నాను. పిల్లలు చక్కగా గుర్తించవచ్చు. భోజన సమయంలో పాస్టలులో కూడా ప్రార్తింస్తుంటారు. ఏమని? దైవమెక్కడ అని అనుకుంటారు. బ్రహ్మార్పణం బ్రహ్మాహవిః. బ్రహ్మార్పణం చెబుతున్నాను అంటారు. కాని, కొంతమంది నేను అర్పణం చేసుకుంటూ బ్రహ్మార్పణం ఎందుకు చెబుతున్నాను. బ్రహ్మ ఎక్కడున్నాడు? లోపలనుంచి వస్తున్నాది జవాబు. ఒరే పిచ్చివాడా! నేను ఎక్కడో ఉంటున్నానుకుంటున్నావు. నీలోనే ఉంటున్నాను. నీవు తిన్నదంతా జీర్ణింపచేసి ఆ రసము సర్వాంగములకు సప్లై చేస్తున్నాను. ఏ ఒక్కరైనా ఈ స్వార్థరహితమైన పని చేస్తున్నారా? ఒక్క దైవము మాత్రమే యిట్లా చేస్తున్నాడు. భుజించినది జీర్ణింపచేసి చక్కని రసముగా మార్చి సర్వాంగములకు సప్లై చేస్తున్నాడు.

**కింగ్ కంటె కింగ్‌మేకర్ గొప్పవాడు**

మహాభారతయుద్ధములో కృష్ణుని తత్త్వాన్ని మీరు చక్కగా గుర్తించవచ్చు. అనేక రాజులను జయించాడు. ఎంతమంది రాజులను జయించినా తాను రాజు కాలేదు. ఇంకొకరికి పట్టము కట్టటము, తాను నిమిత్తమాత్రంగా ఉండటం. ఒకానొకసమయంలో అర్జునుడు ప్రశ్నించాడు. కృష్ణా! ఇన్ని విజయాలు సాధిస్తున్నావు. ఈ విజయాలంతా యితరులకు పెడుతున్నావు. నీవు భాధ్యత వహించకూడదు. నేను కింగ్ మేకర్ అన్నాడు. కింగ్ కంటె కింగ్ మేకర్ గొప్పవాడు. నీ కింగ్ మేకర్ ఎక్కడుంటున్నాడు? నీ హృదయములోనే ఉంటున్నాడు. అన్ని అంగములకు శక్తినందిస్తున్నాడు. పనిచేస్తున్నానని అహంకారపడుతున్నావు. నేను పంపించిన రసముతోనే చేస్తున్నాది. నీవు కాలితో కొడుతున్నావు. నీ కాలికి వచ్చిన శక్తి నేను యిచ్చిన శక్తియే. కాలికి, చేతికి, నోటికి, కంటికి దైవము యిచ్చిన శక్తులే. దైవశక్తియే సర్వశక్తులను నడిపిస్తున్నాది.

**భక్తి లోపమేగాని శక్తి లోపము లేదు**

ఆ విశ్వాసము యువకులు పెంచుకోవాలి. పెంచుకుంటూ పోతే వారి జీవితములో అత్యంత స్వల్పకాలములోనే యీ ఆనందమును అనుభవించగలము. దృశ్యముగా చూడగలము. అనుభూతి కావాలి. అనుభూతి మన హస్తములోనే ఉంటున్నాది. నీవు చేయలేకపోతున్నావేగాని చేస్తే నీ అనుభూతికి వస్తుంది. కాని, నీ చేయలేని బలహీనత, అలక్ష్యము, భగవంతునిపై తోసి భగవంతుని దూషిస్తున్నావు. ఆడేది చేతకానప్పుడు డోలుపై అరిచాడట. అదేరీతిగా, చేసే శక్తి లేనప్పుడు దైవముపై నెపము వేస్తున్నాం. వస్తుంటాయి, యిలాంటి భావములు అప్పుడప్పుడు. కాని, నీవు విచారణ చేయాలి. ఇది నా దోషమా? దైవము దోషమా? దైవములో ఎట్టి దోషములూ లేవు. గుణాతీతుడు తాను. దోషరహితుడు తాను. నీ దో,ములే ప్రతిబింబిస్తున్నాయి. నీ దోషములే అన్నివిధాలా అనుమానాలు చేకూరుస్తున్నాయి. దైవములో కించిత్తైనా దోషములు వెతకటానికి ఎవరికీ వీలుకాదు. ఎవరికీ చేతకాదు. ఎవరికీ అధికారము లేదు. చాలా తూర్లు చెప్పాను. ఈ కష్టములకు ఓర్చుకోలేక, బాధలను భరించుకొనలేక త్యాగరాజుకూడా రామునిపై నెపము వేస్తూ వచ్చాడు. స్వామీ నిరంతరము నిన్ను చింతిస్తున్నాను కదా! నా భక్తిలో దోషమా లేక నీ శక్తిలో దోషమా? కొంతవరకు విచారించి , నా భక్తిలో దోషము లేదు, నీ శక్తిలోనే దోషముంది. ఈనాటి భావములవే. తన దోషమును తాను మరుగు చేసుకుంటున్నాడు. పరుల దోషాన్ని బయట పెడుతున్నాడు. ఇది భక్తులలోని బలహీనత. రామునిలో శక్తి లేదు. నిజంగా అతనిలో శక్తి ఉంటే నా కష్టము ఎందుకు పరిహారము చేయకూడదు? నా భక్తిలో దోషము లేదు, రాముని శక్తిలోనే దోషము ఉంది. తరువాత కొంచెం నిదానం చేసుకున్నాడు. యోచన చేసుకున్నాడు. భగవంతుడు దోషరహితుడు. భగవంతుని హృదయము నిర్మలము. ఇలాంటి భగవంతునిపై దోషము వేయటము ఎంత దోషము. నీలో శక్తి లేకపోతే

కపి వారధి దాటునా కలికి రోటగట్టునా
లక్ష్మిదేవి వలచునా లక్ష్మంణుండు కొచునా
సూక్ష్మబుద్ధిగల భరతుడు చూచిచూచి మ్రొక్కునా
అబ్బ రామశక్తి ఎంతో గొప్పరా!

అప్పుడు తెలుసుకున్నాడు, నీ శక్తి ఎంత గొప్పది స్వామీ. లక్ష్మిని ప్రపంచమంతా ప్రార్థిస్తున్నది. ఇంత ప్రపంచమంతా ప్రార్థిస్తున్న లక్ష్మీదేవి నీ పాదాలు వత్తుతుంటే నీలో శక్తి లేకనా లేక బుద్ధి తక్కువా! భరతుడు ఎంత సూక్ష్మబుద్ధి కలవాడు. లక్ష్మణుడు సాకారస్వరూపాన్ని సేవచేస్తూ వచ్చాడు. కానీ, రామునికి దూరంగా ఉంటుండి రాముని నిరాకార సేవ చేస్తూ వచ్చాడు భరతుడు. అతనిది నిరాకార ఆరాధన. రామునిలో లీనమయ్యాడు భరతుడు. భరతుడు, రాముడు భేదరహితము, ఏకాత్మ భావాన్ని అనుభవించాడు భరతుడు. దైవచింతన చేస్తే దైవమే అయిపోవాలి. దైవచింతన చేస్తుంటే నేనింకా దైవము కాలేదే అని తలచుకుంటే నీవు దైవము కావు దయ్యమే అయిపోతావు. తెలియకుండా దైవము కావాలి.

**ధ్యానం ఎంతకాలం చెయ్యాలి**

అందువల్లనే అనేకమంది రమణమహర్షి దగ్గరికి వెళ్లి, 'స్వామీ! మేము ఎంతకాలం ధ్యానం చెయ్యాలి? గంట చేయాలా, అర్థగంట చేయాలా, ఐదు నిముషాలు చాలా?' అడిగారు. 'నాయనా! నేను ధ్యానం చేస్తున్నానని తెలియకుండా ఉండేంతవరకు చేయాలి' అన్నాడు. నేను ధ్యానము చేస్తున్నాను అంటే అది ధ్యానము ఎట్లా అవుతుంది. ధ్యానము చేస్తున్నానని తెలియకుండా పోవాలి. అది ధ్యానం నేను ఎంతసేపు భోజనం చేయాలి అంటే, ఐదు నిముషాలలో భోజనం చేస్తానంటారు. సాయిబాబా ఒక సెకండులో భోజనం చేసి వస్తాడు. నేను అర్థగంట భోజనం చేస్తాను. సరైన జవాబు కాదు. ఎంత సేపు భోజనం చేస్తావు? కడుపు నిండేవరకు భోజనం చేస్తావు, అది సరైన జవాబు. ఎక్కువ టైము భోజనం చేస్తే ఎక్కువ భోజనం చేసినట్టు కాదు. కడపు నిండేంత వరకు భోజనం చేయాలి. హృదయము పండేంతవరకు మనం ప్రార్థించాలి. ఆ హృదయం పండటం అంటే ఏమిటి? అన్ని ప్రేమలు మనవైపోవాలి. ప్రేమమయంగా మారాలి.

**ఏ పని చేసినా దైవభావంతో చేయాలి**

ఇట్టి ప్రేతత్త్వము పెంచుకుంటే ఈ యుగములు, ఈ ఘడియలు, ఈ కర్మబంధములు యేమాత్రమూ చలింపచేయలేవు. దేనికీ బెదరనక్కరలేదు. దేనికీ మనం అదరనక్కరలేదు. అన్నింటినీ ఎదుర్కొనటానికి తగిన శక్తిని సంపాయించాలి. ఆ శక్తి ఎక్కడనుంచి వస్తుంది? నాలో దైవము ఉన్నాడు అనే విశ్వాసమునుంచి వస్తుంది. ఆ విశ్వాసము పెంచుకోండి. అన్నీ మనకు విజయాన్నే చేకూరుస్తాయి. ఈ సంవత్సరముగూర్చి ఎవరో ఏదో చెప్పారని మీరు చలించవద్దు. పంచాగము వ్రాసినది ఎవరు? సిద్ధాతి. కానీ, కాలస్వరూపుడైన భగవంతుని స్మరించుకున్నప్పుడు ఈ సిద్ధాంతి ఏమి చేయగలడు? దైవచింతన చేస్తే యివన్నీ లీనమైపోతాయి. మనం ఏ పని చేసినా దైవకార్యముగా విశ్వసించి దైవభావముతో చేయాలి. ఉగాది లోపల యువకులు దైవచింతన అధికంగా విశ్వసించాలి. భారతదేశములో యువకులు జాతీయ భావాన్ని మరచిపోతున్నారు. నా దేశము అంటే ఏమిటి? నా మతమంటే ఏమిటి? నా జీవితమంటే ఏమిటి? విద్య అంటే ఏమిటి? అనే విషయాలను మరచిపోతున్నారు.

**నేర్చుకోటం కంటె ఆచరించటం ముఖ్యం**

విద్య అంటే ఏమిటి? గ్రంథ పరిచయము. గ్రంథములు చదవటము. ఇది గ్రంథ పరిచయము కాదు. ఎవరి పడక గదిలో ఎక్కువ పుస్తకాలుంటయో వానికి ఎక్కువ రోగాలున్నాయని అర్థము. ఎప్పుడూ పుస్తకములు చదవటం రోగమే. అది కాదు మనం నేర్చుకోవలసినది. నూరు నేర్చుకొనేదానికంటె ఒకటి మనం చేసి చూపించాలి. ఆచరణలో పెట్టాలి యీనాటి యువకులు. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి. మన జన్మభూమి, జన్మతల్లి వీటిని స్వర్గము కంటె అధికముగా భావించాలి. కానీ, ఈనాడు మనయొక్క తల్లిపై ప్రేమ లేదు, జన్మభూమిపై ప్రేమ లేదు. ఎవరినో ప్రేమిస్తున్నారు. ఏమిచి ఈ ప్రేమ. ప్రేమించవలసినది నీ తల్లిని, దైవాన్ని. అందువల్లనే మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అన్నారు. తల్లిని సంతోషపెట్టు మొదట. మధ్యలో వచ్చిని పెద్దగా యిది చేస్తున్నావు. ఇది ఒక బలహీనత. ఇది కాదు మనం చేయవలసినది. మన ప్రేమ మారని ప్రేమగా మార్చుకోవాలి. దివ్యమైన ప్రేమగా మార్చుకోవాలి. ఎట్టి పరిస్థితియందు దీనిని ఏమాత్రము శ్రమ కూడదు. చలించని మనసును, భ్రమించని దృష్టిని మనము సంపాయించుకోవాలి. ఆ దైవ ప్రేమ ఒక్కటి వుంటే అన్ని ప్రేమలు దానిలో విలీనైపోతాయి. భగవంతుని చింతిస్తూ రండి. అతనికంటె మించిన స్నేహితుడు మనకు లేదు. స్వార్థరహితమైనవాడు భగవంతుడు. అతనిని నిజమైన మిత్రునిగా మీరు భావించండి. అతనిని మీరేమైనా భావముతో చేస్తే అతనే నీకు శతృవు అవుతాడు. భగవంతుని ఎప్పుడూ మిత్రునిగా చూసుకో. మిత్రునిగా ప్రేమించు. అతని ప్రేమలో నీ ప్రేమ లీనం చేయి. అదే చాలు.